
# సాక్షి
## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ı 30 ı నవంబర్ ı 2024



**సోమశిలలో 69.39 టీఎంసీలు**

ఆత్మకూరు: సోమశిల జలాశయంలో శుక్రవారానికి 69.39 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 8,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 1,800, ఉత్తర, దక్షిణకాలువలకు 750, కండలేరుకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.79,000 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ7,163 |
| 3శాతం జీఎస్టీతో | రూ.7,378 |
| నవర (8గ్రా) | రూ.59,024 |

గరిష్టం/కనిష్టం
27.2 /24.1

**వాతావరణం**

జిల్లాలో శనివారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో 95 శాతం తేమ ఉంది.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 30న పింఛన్లు పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లోని 3,09,000 మంది లబ్ధిదారులకు రూ.131.62 కోట్ల నగదును పంపిణీ చేయనున్నారు. నగదును ఇప్పటికే కార్యదర్శులకు అందజేశారు.

### జిల్లా విద్యాశాఖలో బదిలీలు

నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖలో పలువురు డిప్యూటీ డీఈఓలు, ఏడీ, సూపరింటెండెంట్ బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే రిలీవ్ కావాలని ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరు డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న కె.ప్రసన్నలక్ష్మిని నెల్లూరు విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా, ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న టి.విజయకుమార్‌ను కడప ఆర్జేడీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆత్మకూరు డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న గోపాల్, కావలి డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న పి.రఘురామయ్యను విజయవాడ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. నెల్లూరులో ఎయిడెడ్ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న టీఎస్ అనిల్‌కుమార్‌ను డిప్యుటేషన్‌పై విజయవాడ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

### విద్యుత్ భవన్ వద్ద మీటర్ రీడర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రీడర్లు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు నేరుగా వారి బ్యాంకు అకౌంట్‌కు వేతనాలు చెల్లించాలంటూ శుక్రవారం విద్యుత్ భవన్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) నిరసన చేపట్టింది. అనంతరం ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్ మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఉత్తర్వుల మేరకు మీటర్ రీడర్స్‌కు సెప్టెంబర్ నెల నుంచి వేతనాలు ఎస్కో పద్ధతిలో బ్యాంకు ఖాతాలకు నేరుగా వేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రీడర్లను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో 20 ఏళ్లుగా మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న వారందరికీ ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, హజరత్ వలీ, బాలకృష్ణ, వెంకటసుబ్బయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కన్నీటి బతుకులు

**అయ్యో.. ఓ.. వలస కూలీ**

స్వర్ణోత్సవాలు.. అర్థశతాబ్ది ఉత్సవాలు, వజ్రోత్సవాలు, శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే భారతావనిలో వలస కూలీల బతుకుల్లో ఆనందోత్సవాలు అంతర్ధానం అయ్యాయి. పుట్టిన ఊరు, బతికిన పల్లెలో బతుకుదెరువు దొరక్క కాలే కడుపులను చేత పట్టుకుని రాష్ట్రాలు దాటి వారంతా వస్తున్నారు. కన్న వారికి, కడుపున పుట్టిన బిడ్డలకు పట్టెడన్నం పెట్టేందుకు పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. ఊరుగాని ఊరులో ఆపదొస్తే.. ఆదుకోవాల్సిన వారు మానవత్వాన్ని మరిచి వారి మానాన వారిని వదిలేస్తున్నారు. విధి వశాత్తు ప్రాణాలు పోగొట్టుకున్న వలస కూలీలు ఆత్మీయుల కడసారి చూపులకు నోచుకోలేకపోతున్నారు.



ఇటీవల విడవలూరులో గుండెపోటుతో మృతి చెందిన ఉమిత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు (ఫైల్)

- జిల్లాలో ముమ్మరంగా వరినాట్లు
- పనుల కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఏటా 10 వేల మంది రాక
- వలస కూలీల కష్టాన్ని దోచుకుంటున్న దళారులు
- పొద్దస్తమానం కష్టించినా దక్కని గిట్టుబాటు కూలీ
- విధివశాత్తు ఇటీవల ముగ్గురు కూలీల మృతి
- చేతిలో చిల్లిగవ్వలేక.. మృతదేహాలను స్వస్థలానికి తీసుకెళ్లలేక..
- ఆత్మీయుల కడచూపులకు నోచుకోక ఇక్కడే అంత్యక్రియలు

కోవూరు: రెక్కాడితే కానీ డొక్కాడని వలస బతుకులు. కళ్లల్లో కన్న వాళ్లు, బిడ్డలు కదిలాడుతున్నా.. వారి కాలే కడుపులకు పట్టెడన్నం పెట్టేందుకు ఊరుదాటి నూర్ల మైళ్లు.. కట్టుబట్టలతో కాలికి బలపం కట్టుకుని వారంతా వచ్చారు. ఆకలి దప్పులతో పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా.. కష్టానికి తగిన ఫలితం రాక.. తమ వారి ఆకలి తీర్చేందుకు కన్నీళ్లు మింగుతూ పరాయి పంచన బతుకున్నారు. వీరి కష్టాన్ని దోచుకుంటూ దళారులు జేబులు నింపుకుంటున్నారు. విధితోపాటు దళారులు వారి జీవితాలను ఆడుకుంటున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు జరుగుతోంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో సాగుకు సంబంధించి నాట్లు ముమ్మరంగా జరుగుతాయి. స్థానికంగా వరినాట్లు వేసేందుకు కూలీల కొరత ఉండడంతో కొన్నేళ్ల క్రితం వరకు ఉమ్మడి శ్రీకాకుళం, గుంటూరు, తెలంగాణ రాష్ట్రంలోని పాలమూరు, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి కూలీలు వచ్చి వరినాట్లు వేసే పరిస్థితి ఉండేది. అయితే కొన్నేళ్లుగా అన్ని ప్రాంతాల్లో ఒకేసారి వర్షాలు కురుస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి కూలీలు రావడం తగ్గింది. ఈ క్రమంలో జిల్లాకు చెందిన కొందరు మేస్త్రీలు పక్క రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువచ్చి వరినాట్లు వేయిస్తూ వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నారు. వీరు పని వేగంగా చేయడం, తక్కువ రేటుకు దొరుకుతుండటంతో స్థానిక రైతులు కూడా ఎక్కువగా వారిపైనే ఆధారపడుతున్నారు. ప్రధానంగా జిల్లాలో పెన్నార్ డెల్టా ప్రాంతంలో ప్రస్తుతం విస్తృతంగా వరినాట్లు జరుగుతున్నాయి.

### విధి వికటించి.. తనువు చాలించి..

పనుల కోసం వచ్చిన కూలీల్లో కొందరి జీవితాలు విషాదాంతంగా ముగుస్తున్నాయి. కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతాల్లో విధివశాత్తు వారం రోజుల్లో ముగ్గురు కూలీలను మృత్యువు కబళించింది. అయితే వీరి మృతదేహాలను స్వస్థలానికి తీసుకెళ్లడానికి కూడా చేతిలో చిల్లిగవ్వ లేక.. అండగా నిలిచే దిక్కులేక.. పుట్టిన ఊరులో అయిన వాళ్లు, ఆత్మీయుల కడసారి చూపునకు నోచుకోక ఇక్కడే ఖననం చేసి పుట్టెడు దుఃఖంతో సహచరులు స్వగ్రామాలకు వెళ్తున్నారు. ఈ నెల 20న విడవలూరులో పొలంలో పనిచేస్తుండగానే పశ్చిమబెంగాల్‌కు చెందిన ఉమిత్ (30) కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు అతన్ని స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే పశ్చిమబెంగాల్ నుంచి తీసుకువచ్చిన మేస్త్రీ పట్టించుకోలేదు. తల్లితో పాటు కుటుంబ సభ్యులు చేతిలో చిల్లిగవ్వలేక.. స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లలేక, పీహెచ్‌సీ వెనుక ప్రాంతంలో ఖననం చేసి పుట్టెడు దుఃఖంతో సొంతూరుకు వెళ్లిపోయారు. ఈ నెల 23న కోవూరులో వరినాట్లకు కూలీలను తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాయబరేలీకి చెందిన సుసేన్ సర్దార్ (30) దుర్మరణం చెందాడు. ఈ నెల 27న బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలలో వరినాట్ల కోసం వచ్చిన కూలీల్లో పశ్చిమబెంగాల్‌కు చెందిన విశ్వజిత్ మండల్ (40) అర్ధరాత్రి వేళ కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటి వెళ్తుండగా బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాహనం ఢీకొని దుర్మరణం చెందాడు. తోటి కూలీలు, బంధువులు అతని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లిపోయారు.

ఈ క్రమంలో బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, అల్లూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు తదితర ప్రాంతాలకు కూలీల ముఠాలు వచ్చాయి.



వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు





మృతిచెందిన బెంగాలి వాసులు సుసేన్ సర్దార్, విశ్వజిత్ (ఫైల్)

### కష్టం దోపిడీ.. ఆలనా పాలన గాలికి..

జిల్లాలో వరినాట్లు పనులకు వివిధ రాష్ట్రాల నుంచి ఈ సీజన్‌లో దాదాపు 10 వేల మంది వస్తున్నట్లు సమాచారం. మూడు నెలల పాటు ఇక్కడే ఉండి. వ్యవసాయ నాట్లు పూర్తయ్యాక కాస్తో కూస్తో కూడబెట్టుకుని తిరిగి స్వగ్రామాలకు వెళ్లిపోతారు. అయితే అక్కడి నుంచి కూలీలను తీసుకువస్తున్న మేస్త్రీలు వారి కష్టాన్ని దోచుకుంటున్నారే తప్ప.. ఆలనా పాలనా పట్టించుకోవడం లేదు. విధివశాత్తు ఏదైనా విషాద పరిస్థితులు జరిగితే.. కనీసం మానవత్వం కూడా చూపించడం లేదు. కూలీలను జట్లు జట్లుగా విభజించి వారికి దక్కే కూలీని కాజేస్తున్నారు. ఇక్కడ సాధారణంగా ఎకరం వరినాటు వేసేందుకు రూ.4,500 రైతులు చెల్లిస్తున్నారు. అయితే మేస్త్రీలు ఆ కూలీలకు కేవలం రూ.3 వేలు వంతున ఇస్తున్నారు. 8 మంది జట్టు రోజుకు 3 ఎకరాల్లో నాట్లు వేస్తున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా 12 గంటల చలి వాతావరణంలో చల్లని నీటిలో, బురదలో పని చేస్తే ఒక్కొక్కరికి రోజుకు రూ.1,125 దక్కితే.. ఇందులో బెంగాల్ నుంచి ఇక్కడ పనులకు పంపించిన ఏజెంట్‌కు ఒక్కొక్కరు రోజుకు రూ.300 చెల్లించాలి. ఇలా రోజంతా కష్టపడితే కూలీలకు దక్కేది కేవలం రూ.825 మాత్రమే. కూలీల నుంచి ఇంత దోచుకుంటున్న ఏజెంట్, మేస్త్రీలు వారికి ఏదైనా ఆపద వస్తే.. వారిని వారి మానాన వదిలేస్తున్నారు. వలస వచ్చే కూలీల కుటుంబానికి ముందుగా రూ.2 వేల పెట్టుబడి ఇస్తారు. ఇక్కడ చేసిన పనికి కూలి డబ్బులు కూడా దళారుల ద్వారానే అందుతాయి.

**మాకు కూలి తక్కువగా వస్తుందని..**



మా ప్రాంతంలో దినసరి కూలి పనులు సరిగా ఉండవు. ఉన్నా.. బతుకుదెరువుకు సరిపడా పనులు ఉండదు. కూలి డబ్బులు దొరకవు. ఇక్కడ పనులు ఉండడంతో మా ఏజెంట్ ద్వారా వచ్చాం. మూడు నెలల వరకు పని దొరుకుతోంది. పనిచేస్తే వచ్చే కూలి డబ్బులతో మాకు కొంత ఊరట లభిస్తుంది.
– జియరుణ్, మేస్త్రీ, పశ్చిమబెంగాల్

**రోజుకు రూ.800 కూలి ఇస్తున్నారు**



నేను మా ఊరిలో ఉన్నప్పుడు సరిపడా పనిదొరకదు. మాకు పనికి తగిన కూలి రాదు. ఎప్పుడూ పనికోసం ఎదురు చూపులే. మా కుటుంబం మొత్తం పనికి వెళ్లినా కుటుంబ పోషణ కష్టంగా ఉంటుంది. అందరి ఆకలి తీర్చడం కోసమే దూర ప్రాంతమైనా ప్పటికీ మా వాళ్లను వదిలేసి ఇలా వలస రాక తప్పడం లేదు.
– సఫోన్ సర్దార్, పశ్చిమబెంగాల్

**అప్పుడు చాలా భయమేసింది**



మా ఊరు నుంచి కూలి పనులకు వలస వచ్చినప్పుడు అప్పుడప్పుడు అనుకోని కొన్ని సంఘటనలు జరిగాయి. ప్రమాదాలు జరిగినప్పుడు చాలా భయం వేస్తుంది. మా ప్రాంతం నుంచి వచ్చిన వారిలో ముగ్గురు చనిపోయారని తెలిసి బాధపడ్డాం. కానీ కుటుంబ పోషణకు తప్పని పరిస్థితి మాది.
– కక్కోన్ సర్దార్, పశ్చిమబెంగాల్

**ఆ నాట్లకు మనకు తేడా ఉంది**




ప్రస్తుత సీజన్‌లో జరుగుతున్న వరి నాట్లు కోసం బెంగాల్, ఉతరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా ప్రాంతాల నుంచి కూలీలు వస్తున్నారు. వీరి వేసే వరినాట్ల విధానానికి, మనకు చాలా తేడా ఉంది. వీళ్ల వేసే నాట్లకు దిగుబడులు కూడా పెరుగుతుండడంతో, నాట్లు కూడా త్వరగా పూర్తవుతుండడంతో అందరూ వీరితో వేయిస్తున్నారు.
– మోచర్ల శ్రీనివాసులు, పడుగుపాడు

---

**మత్స్యకార భరోసా**

# గంగార్పణం

మత్స్యకారులను టీడీపీ ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వేట నిషేధ పరిహారం అరకొర మందికి అదీ తొలి రెండేళ్లు రూ. 2 వేలు, మరో రెండేళ్లు రూ.4 వేల వంతున సాయం చేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పరిహారాన్ని రూ.10 వేలకు పెంచడంతోపాటు గత టీడీపీ హయాంలో కంటే మిన్నగా అత్యధిక మందికి అందజేసి ఆదుకుంది. ఎన్నికల ముందు వేట నిషేధ పరిహారం రెట్టింపు చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా అయినా ప్రభుత్వం సాయం ప్రకటిస్తుందని ఎదురు చూసిన మత్స్యకారులకు సంబంధిత శాఖ మంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రస్తుతానికి పరిహారం ఇవ్వలేమంటూ చేసిన ప్రకటన మింగుడు పడడం లేదు.








సముద్రపు ఒడ్డున వలను సరిచేసుకుంటున్న మత్స్యకారులు, వేటకు వెళ్తున్న మత్స్యకారులు

- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- అసెంబ్లీ సాక్షిగా ప్రస్తుతం ఇవ్వలేమని సంబంధిత శాఖ మంత్రి వెల్లడి
- ఆర్థిక సాయం ఎగనామం పెట్టడానికి సాకులు

కావలి: మత్స్యకారులకు వేట నిషేధ సాయం అందజేయడానికి ఈ ఏడాదికి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా 'సారీ' చెప్పింది. ఎన్నికలకు ముందు పరిహారం అంతన్నారు.. ఇంతన్నారు.. చివరికి చిప్ప చూపించారు. సముద్రంలో చేపలు పిల్లలు పొదిగే కాలం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61 రోజులు వేట నిషేధం అమలవుతోంది. ఈ సమయానికి 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లకు గాను నాలుగేళ్లు అది కూడా అరకొర మందికి ఏడాదికి రూ.4 వేల చొప్పున అందించింది. చివరి ఏడాదిలో చంద్రబాబు ప్రభుత్వం ఆర్థిక సహాయం ఎగ్గొట్టింది. 2019లో వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడంతోనే గత ప్రభుత్వం కంటే మిన్నగా 15,050 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి పరిహారాన్ని కూడా పెంచి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున అందించారు. ఈ లెక్కతో పోల్చితే టీడీపీ హయాంలో ఏడాదికి జిల్లా మొత్తంగా ఐదారు వేల మందికి కూడా పరిహారం అందించలేదని ఆనాటి గణాంకాలు చెబుతున్నాయి. లబ్ధిదారుల లెక్కలు సిద్ధంగా ఉన్నప్పటికీ ఎగ్గొట్టేందుకు సాకులు చెబుతూ సర్వే చేస్తున్నామంటూ ప్రస్తుతానికి భరోసా ఇవ్వలేమని సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**వైఎస్సార్‌సీపీ హయాంలో పరిహారం**

| ఏడాది | లబ్ధిదారులు | పరిహారం |
|---|---|---|
| 2019 | 15,050 మంది | రూ.15,05,00,000 |
| 2020 | 10,112 మంది | రూ.10,11,20,000 |
| 2021 | 10,235 మంది | రూ.10,23,50,000 |
| 2022 | 10,689 మంది | రూ.10,68,90,000 |
| 2023 | 12,072 మంది | రూ.12,07,21,000 |
| 2024 | 12,444 మంది | (టీడీపీ అధికారం) |

**రూ.20 వేలిస్తామని.. అసలుకే మోసం**

అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు ఏటా వేట నిషేధ పరిహారాన్ని ఉదారంగా అందించింది. లబ్ధిదారుల ఎంపిక నుంచి పరిహారం పెంపు వరకు గత టీడీపీ ప్రభుత్వం కంటే మిన్నగా అందించింది. ఏటా జూన్ చివరి వారంలో కానీ, జూలై నెలలోగాని గత ప్రభుత్వం ఠంచన్‌గా అందించింది. అయితే ఈ పరిహారాన్ని మరింతగా పెంచి రూ.20 వేలు చొప్పున ఇస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీలు గుప్పించారు. మేనిఫెస్టోలో ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చిన నెలలోనే పరిహారం ఇవ్వడానికి వీలుగా అర్హులైన లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసినప్పటికీ ఆ ఊసే లేదు. కనీసం ప్రపంచ మత్స్యకార దినోత్సవం రోజున అందిస్తారని మత్స్యకారులు భావించారు. అయితే ఈ ఏడాదికి పరిహారం ఇవ్వడం వీలు పడదని మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో ప్రకటించారు.

**ప్రభుత్వం మత్స్యకారుల గోడు పట్టించుకోవాలి**



ఈ ఏడాది ప్రారంభం నుంచే చేపలు వేట చాలా నిరుత్సాహంగా ఉంది. సముద్రంలో వేట సాగక మత్స్యకారులు ఇప్పుడు కూడా ఇంటి పట్టునే ఉంటున్నారు. వేట విరామ సమయంలో గత ప్రభుత్వం కంటే మిన్నగా రూ.20 వేల వంతున ఆర్థిక సహాయాన్ని ఇస్తానని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ ఏడాదికి ఇవ్వలేమని మత్స్యశాఖ మంత్రి చెప్పడం బాధాకరం. మత్స్యకారులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు.
– కొమారి రాజు, మత్స్యకార నాయకుడు, కావలి

**టీడీపీ హయాంలో తొలి రెండేళ్లు రూ.2 వేలే పరిహారం**

2014–19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం 2014–15, 2015–16 సంవత్సరాల్లో ఏడాదికి రూ.2 వేలే పరిహారం అందించింది. 2016–17, 2017–18 సంవత్సరాల్లో రూ.4,000 వంతున ఇచ్చింది. ఐదో ఏడాది 2018–19 బకాయిలు చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కొక్కరికి రూ.10,000 వంతున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకుని, టీడీపీ ప్రభుత్వం ఎగనామం పెట్టిన చివరి ఏడాది 2018–19 బకాయిలు చెల్లింపుతోనే వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించారు. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న అర్హుడైన ప్రతి మత్స్యకారుడుకి ప్రభుత్వం వైఎస్సార్ మత్సకార భరోసా కింద రూ.10,000 చొప్పున వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుండేది.

## జిల్లాకు భారీ వర్షసూచన

- వాయుగుండంగా బలహీనపడిన తుఫాన్

నెల్లూరు (అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం తన దిశ మార్చుకుంది. తొలుత ఫెంగల్ తుఫాన్‌గా మారినట్లే మారి బలహీనపడి వాయుగుండంగా గంటకు 12 కి.మీ వేగంతో ఉత్తర తమిళనాడు వైపు కదులుతోంది. కరైకల్‌కు దగ్గరగా మహాబలిపురం, పుదుచ్చేరికి మధ్య శనివారం తీరందాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. దీని ప్రభావంతో జిల్లా తీరంలో ఇప్పటికే సముద్రంలో అలలు భారీ ఎత్తున ఎగిసిపడుతున్నాయి. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. తీర ప్రాంతంలో ఈదురు గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. వాయుగుండం తీరం దాటే సమయంలో దక్షిణ కోస్తాపై ప్రభావం ఉండొచ్చని అధికారులు ప్రకటించారు. మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఒకటి, రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

## జిల్లాకు ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు

నెల్లూరు(అర్బన్): పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను జిల్లాలోని వివిధ విభాగాల్లో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బి.మహేశ్వరరెడ్డిని నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించింది. బి.చంద్రలీను నెల్లూరు కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఎ.మురళిని నెల్లూరు టీజీపీ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించింది.



టెక్కేమిట్ట రోడ్డు



# దారులు దారుణం.. పట్టించుకుంటే ఒట్టు

కూటమి ప్రభుత్వం ప్రజలకు కావాల్సిన పనులు చేపట్టడంలో పూర్తిగా విఫలమైంది. అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధులు దోచుకోవడం, కక్ష సాధింపు రాజకీయాలు చేయడం, ప్రశ్నించే ప్రతిపక్షాలపై తప్పులు కేసులు పెట్టడం.. తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రహదారులపై చిన్నపాటి గుంతలను కూడా పూడ్చడం లేదు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో ప్రధాన రోడ్లపై భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. వర్షాల సమయంలో ఇవి అత్యంత ప్రమాదకరంగా మారాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా కూటమి పెద్దలకు పట్టడం లేదు. మైకు ముందు మాత్రం రోడ్ల పనులు చేస్తామని ఆర్భాటంగా చెబుతున్నారే తప్ప తట్ట మట్టి కూడా వేసిన పాపాన పోలేదు. వర్షాలు కురిసినప్పుడు రోడ్లు ఇంకా దారుణంగా ఉన్నాయి.

– నెల్లూరు సిటీ

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కొత్తకాలువకు వెళ్లే దారిలో..

మూడో మైలులో..





చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఇలా..



ముత్తుకూరు రోడ్డు

## ‘ఉపాధి’లో తెలుగు తమ్ముడి చేతివాటం

• సొంత పార్టీ నాయకులే వెల్లడి

ఇందుకూరుపేట: ఉపాధి పనుల్లో కొమరికకు చెందిన టీడీపీ నాయకుడు మునగశెట్టి మనోహర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని ఆ పార్టీ నేతలే ఆరోపించారు. శుక్రవారం ఆ గ్రామంలో తాతా వెంకటేష్ అనే మరో నాయకుడు విలేకరుల సమావేశం నిర్వహించి సొంత పార్టీ నేతల అవినీతిని బహిర్గతం చేశాడు. వెంకటేష్ మాట్లాడుతూ కాలువ పూడికతీత పనులు సక్రమంగా చేయడం లేదన్నారు. దీంతో సాగునీటి విషయంలో సమస్యలు తలెత్తుతున్నట్లు చెప్పారు. మనోహర్ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా 60 మంది పేర్లను నమోదు చేసి 20 మంది చేత మాత్రమే పనులు చేయిస్తున్నారన్నారు. అలాగే అతని భార్య పేరు సైతం నమోదు చేయించాడని ఆరోపించారు. ఇష్టానుసారంగా పేర్లు నమోదు చేసి నగదును కాజేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు పని చూపించకుండా దోచుకుంటున్నట్లు చెప్పారు. ఈ అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాన్నారు. సమావేశంలో బత్తిన రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 111
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 187



## వీఎల్టీ పనులు కేటాయించొద్దు

• కలెక్టర్‌కు వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థతోపాటు వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న వీఆర్వోలకు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్టీ – ఖాళీ ఇంటి స్థలానికి పన్ను) వసూలు చేసే పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఆ సంఘానికి చెందిన నాయకులు కలెక్టర్ ఆనంద్‌ను నెల్లూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పంటా అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే నీటితీరువా వసూలు, నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ, రీసర్వే గ్రామసభలు, చుక్కల భూములు, ఫ్రీ హోల్డ్ అసైన్డ్‌మెంట్ తదితర పనులు వీఆర్వోలకు కేటాయించారన్నారు. వాటిలో క్షణం తీరిక లేకుండా ఉన్నారన్నారు. ఇప్పుడు అదనంగా వీఎల్టీ పనులు అప్పగించడంతో ఒత్తిడితో నలిగిపోతున్నామన్నారు. అందువల్ల మినహాయింపు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రమణయ్య, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, తిరుమలరాజు, జగదీష్, రవి, శేఖర్, రాజగోపాల్, విష్ణు, రాజేశ్వరి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు

## బాలికల ఐటీఐలో ప్రాజెక్ట్‌ల ప్రదర్శన



బహుమతులు అందుకున్న వారితో నిర్వాహకులు

నెల్లూరు(టౌన్): నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో శుక్రవారం సీమెన్స్, టాటా స్ట్రైవ్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రభుత్వ ఐటీఐల విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రతినిధులు అనిల్‌కుమార్, జగదీష్, జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డిలు వాటిని పరిశీలించారు. వాకాడు విద్యార్థుల తయారు చేసిన ప్రాజెక్ట్ ప్రథమ, నెల్లూరు ప్రభుత్వ బాలికల ఐటీఐ విద్యార్థుల ప్రాజెక్ట్ ద్వితీయ, బాలుర ఐటీఐ ప్రాజెక్ట్ తృతీయ స్థానంలో నిలిచాయి. వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు, టాటా స్ట్రైవ్ కో–ఆర్డినేటర్ మార్కండేయులు, ప్రభుత్వ బాలిక ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దామని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నెల్లూరులోని ఎస్‌ఏన్‌పీ ప్లస్ కార్యాలయంలో వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి రంగోలి, క్యాండిల్ లైట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ పొరపాట్లు చేస్తే జీవితాంతం ఎయిడ్స్ బారిన పడి మందులు వాడాల్సి ఉంటుందన్నారు. ఎయిడ్స్ నివారణలో స్వచ్ఛంద సంస్థలు మరింత చురుగ్గా పనిచేసి ప్రజలను చైతన్యం చేయాలన్నారు.



క్యాండిల్ లైట్ కార్యక్రమం

## 7న పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు

నెల్లూరు రూరల్: వచ్చే నెల 7వ తేదీన జిల్లాలోని పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. నెల్లూరులోని కార్యాలయంలో శుక్రవారం ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల బలాలు, బలహీనతలపై చర్చించుకోవడానికి, తద్వారా వారి ఎదుగుదలకు సమావేశాలు దోహదపడతాయన్నారు. జిల్లాలోని అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో జె.ఉదయభాస్కర్‌రావు, డీఈఓ ఆర్.బాలాజీరావు, అధికారులు ఉషారాణి, శ్రీనివాసులు, మోహన్ రావు, పెంచలయ్య, పరిమళ, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

కావలి: డిసెంబర్ ఒకటో తేదీ నుంచి కావలిలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ (అండర్–12) బాలబాలికల రగ్బీ పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ఆ కళాశాలలో భోజన, వసతి ఏర్పాట్లు చేశామన్నారు. పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఉంటాయన్నారు. ఏర్పాట్లు కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పర్యవేక్షణలో జరుగుతున్నట్లు వెల్లడించారు.

### శివభక్తుల నగరోత్సవం

పవిత్ర కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 800 మందికి పైగా భక్తులు శుక్రవారం నెల్లూరులోని రంగనాయకులపేటలో తల్పగిరి రంగనాథ స్వామి సన్నిధిలో పూజలు చేసి ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నగరోత్సవం వైభవంగా జరిగింది.

– నెల్లూరు(బృందావనం)



